ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
13-07-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 318 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి

# రాహుల్ ఓయూలో తిరగగలవా?

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్




బీజేపీ కార్యవర్గ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తోందంటూ మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి నేను సవాల్ చేస్తున్నా. మీ పార్టీయే తెలంగాణలో అధికారంలో ఉంది కదా. ఉస్మానియా యూనివర్శిటీలో తిరిగే దమ్ముందా? అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.

# జపాన్ లో లాఫ్ రూల్



**జయభేరి, టోక్యో, జూలై 12:**

రోజులో మీరు ఎంత సేపు నవ్వుతారు..? అసలు నవ్వుతారా..? ఈ ప్రశ్నలు చాలా సిల్లీగా అనిపిస్తుండొచ్చు. కానీ మనకున్న రకరకాల ఒత్తిళ్ల నుంచి పైసా ఖర్చు లేకుండా బయటపడే మార్గం నవ్వడం మాత్రమే. అందుకే లాఫింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయండి అంటూ చాలా మంది ఎక్స్‌పర్ట్స్ సలహాలు ఇస్తున్నారు. బలవంతంగా అయినా కాసేపు నవ్వుకోండి అని చెబుతున్నారు. జపాన్ ఈ విషయంలో ఓ అడుగు ముందుకు వేసింది. "చచ్చినట్టు నవ్వాల్సిందే" అని కొత్త రూల్ తీసుకొచ్చింది. ఆ దేశంలో ఇప్పుడదో చట్టం కూడా అయిపోయింది. పౌరులంతా రోజుకి కనీసం ఒక్కసారైనా కచ్చితంగా నవ్వి తీరాల్సిందే. అలా చేస్తే గుండెపోటు ముప్పు తగ్గిపోతుందట. అందుకే ఇలా కండీషన్ పెట్టింది. నార్త్ జపాన్‌లో యమగర్తలో ఆర్డినెన్స్ కూడా పాస్ చేసింది ప్రభుత్వం. స్థానిక యూనివర్సిటీలో నవ్వుపై పరిశోధనలు చేసి, గుండెపోటు తగ్గిస్తుందని కన్‌ఫమ్ చేసుకున్నాకే ఈ ఆర్డినెన్స్ ఇచ్చారు అధికారులు. గత వారమే ఈ నిబంధన తీసుకొచ్చారు. నిజానికి ఐదేళ్ల క్రితమే ఓ హెల్త్ జర్నల్‌లో ఇందుకు సంబంధించిన ఓ ఆర్టికల్ పబ్లిష్ అయింది. "నవ్వుతో కలిగే ప్రయోజనాలు" అనే టాపిక్‌పై లోకల్‌గా యమగట యూనివర్సిటీలో రీసెర్చ్ జరిగింది. ఇంత రీసెర్చ్

...మిగతాది 2 లో



# రాష్ట్ర ఖజానా పెంచడంపై ఫోకస్

**- జయభేరి, హైదరాబాద్:**

రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచడంపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖల ఉన్నతాధికారులతో సీఎం దాదాపు నాలుగు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. ఆదాయం పెంచేందుకు వీలైనన్ని సంస్కరణలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో ప్రతిపాదించిన మేరకు ఆదాయం రావాలంటే ఆయా శాఖలు లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయా లని స్పష్టం చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరగాలని, పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని సూచిం చారు సీఎం రేవంత్ రెడ్డి. వార్షి క లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను రూపొందించు కుని, ఆ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఆదాయం వచ్చే వనరులపై, పన్నుల వసూళ్లపై అధికారులు నిక్కచ్చిగా ఉండాలని స్పష్టంచేశారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర్వ్యవస్థీకరించుకోవాలని దిశా నిర్దేశం చేశారు. నిర్దేశించిన వార్షి క లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని సీఎం రేవంత్ అభిప్రాయ పడ్డారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో పొందుపరిచిన వార్షి క లక్ష్యాన్ని చేరుకోవాలంటే నెల నెలా లక్ష్యాలను నిర్దేశించుకొని రాబడి సాధించాలన్నారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్షి స్తానని.. ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమ వుతారని చెప్పారు.

# కేజ్రీవాల్ కు బెయిల్




**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 12:**

కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. విస్తృత స్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యులున్న ధర్మాసనానికి కేసును బదిలీ చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అయితే 90రోజులుగా సీఎం కేజ్రీవాల్ జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. మార్చి 21న లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అధికారులు

...మిగతాది 2 లో

# కవితకు బెయిల్.. అప్పుడేనా



**జయభేరి, హైదరాబాద్, జూలై 12:**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనయ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కారాగార వాసం ఇప్పట్లో ముగిసే అవకాశం కనిపించడం లేదు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మార్చి 15న కవితను హైదరాబాద్‌లోని ఆమె ఇంట్లో అరెస్టు చేసింది. తర్వాత ఢిల్లీకి తరలించి ప్రత్యేక కోర్టులో హాజరు పరిచింది. కోర్టు రిమాండ్

...మిగతాది 2 లో



# భారీగా పట్టుబడుతున్న డ్రంకన్ అండ్ డ్రైవ్

**జయభేరి, హైదరాబాద్, జూలై 12:**


ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు. జైలు శిక్ష వేసినా తగ్గడం లేదు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. బుర్రకి ఎక్కించుకోవడం లేదు. ఇప్పుడు చెప్పేది మందుబాబుల గురించి. పీకల వరకూ తాగడం.. అదే కిక్కుతో వాహనాలు నడపడం హైదరాబాద్‌లో కామన్ అయిపోయింది. ప్రమాదాలు జరుగుతున్నాయని మీడియాలో ఎన్ని వార్తలు వస్తున్నా.. భయం, భక్తి లేకుండా ప్రవర్తిస్తున్నారు. జూలై 1నుంచి జూలై 10 వరకు.. అంటే జస్ట్ పది రోజుల వ్యవధిలో సిటీ వ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పెద్ద సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 1,614 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి కేసుల్లో కోర్టువరకూ వెళ్లి ఛార్జ్ షీట్లు దాఖలైనవి 992

...మిగతాది 2 లో

# కాంట్రాక్టర్లకు బిల్లులూ ఇవ్వలేదు

- వైసీపీ ప్రభుత్వం కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేదు...
- గత ప్రభుత్వ తీరుతో కాంట్రాక్టర్లూ ముందుకు రావడం లేదు
- గుంతలు పూడ్చేందుకు తక్షణం రూ.300 కోట్లు అవసరం
- ఆర్ అండ్ బి సమీక్షలో ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు
- అత్యవసర పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశం
- రోడ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీపై అధికారులు, ఐఐటి ప్రొఫెసర్లతో ముఖ్యమంత్రి సమీక్ష





# నీట్ పేపర్ సూత్రధారి రాకీ అరెస్ట్

**జయభేరి, పాట్నా, జూలై 12:**

దేశ వ్యాప్తంగా సంచలనం రేసిన నీట్ యూజీ 2024 పరీక్ష పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేపర్ లీకేజీలో కీలక సూత్రధారిని సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ మేరకు అనుమానితుడు రాజేశ్ రంజన్ అలియాస్ రాకీ అనే వ్యక్తిని పట్నాలో గురువారం మధ్నాహ్నం సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో బీహార్‌లోని పట్నాలో రెండు చోట్ల, కోల్‌కతాలోని మరికొన్ని ప్రాంతాల్లో సీబీఐ సోదాలు నిర్వహించాయి. ఈ నేరానికి సంబంధించి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. నిందితుడిని విచారించేందుకుగాను స్థానిక కోర్టు 10 రోజుల పాటు సీబీఐ కస్టడీ విధించింది. ఈ కేసులో బుధవారం ఇద్దరిని అరెస్టు

...మిగతాది 2 లో

# మల్లారెడ్డి మాస్టర్ ప్లాన్ ఏంటీ



**జయభేరి, హైదరాబాద్, జూలై 12:**

తెలంగాణ రాజకీయాల్లో మాస్ లీడర్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే నేత మాజీ మంత్రి మల్లారెడ్డి. మాస్ మల్లన్నగా అందరూ ముద్దుగా పిలుచుకునే మల్లారెడ్డి తన రాజకీయ జీవితాన్ని కీలక మలుపు తిప్పాలని నిర్ణయించుకున్నారట. స్వతహాగా వ్యాపారవేత్త అయిన మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేతగా బాగా

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేజ్రీవాల్ కు బెయిల్

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. దానిపై విచారణ జరిపారు. అదే క్రమంలో ఆయన బెయిల్ కోసం అనేక సార్లు కోర్టును ఆశ్రయించారు సీఎం కేజ్రీవాల్. లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రచారం నిమిత్తం 21 రోజుల పాటూ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది ఢిల్లీ హైకోర్టు. అయితే ఆ బెయిల్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేయాలని వేసిన పిటిషన్ ను కొట్టేసింది ఢిల్లీ హైకోర్టు. దీనిపై స్పెషల్ కోర్టులను ఆశ్రయించాలని సూచించింది. దీంతో కేజ్రీవాల్ తరపు న్యాయవాదులు స్పెషల్ కోర్టులో పలుసార్లు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కానీ ఫలితం లేకుండా పోయింది. ఇక మధ్యంతర బెయిల్ ముగియడంతో పోలింగ్ ముగిసిన తర్వాత కౌంటింగ్‌కు రెండు రోజుల ముందు జూన్ 2న తిరిగి తిహార్ జైల్లో కేజ్రీవాల్ లొంగిపోయారు. ఇదే ఢిల్లీ లిక్కర్ స్కాములో సీబీఐ కూడా సీఎం కేజ్రీవాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపింది. ఈ తరుణంలో రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్.. బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పెషల్ కోర్టు సానుకూలంగా స్పందించి బెయిల్ ఇస్తే, ఢిల్లీ హైకోర్టు దానిని కొట్టేసింది. దీంతో సీఎం కేజ్రీవాల్ న్యాయవాదులు స్పెషల్ కోర్టు ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు కొట్టేయడాన్ని సవాలు చేస్తూ మరో బెయిల్ పిటిషన్‌ను సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. సీఎం కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీం కోర్టు జూలై 12న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ తరపు వాదనలను ఏకీభవించని సుప్రీం కోర్టు.. కేజ్రీవాల్ ప్రజాప్రతినిధి అని పేర్కొంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం. దీంతో పాటూ ఈ కేసును విస్తృత స్థాయి విచారణ నిమిత్తం ఐదుగురు సభ్యలు ఉన్న బెంచ్‌కు బదిలీ చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 90 రోజులపాటు తిహార్ జైలులో ఉన్న సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌తో స్వల్ప ఊరట లభించినట్లయింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈడీ కేసుల్లో దాఖలు చేసిన పిటిషన్‌పై మాత్రమే జోక్యం చేసుకున్న సుప్రీం కోర్టు.. సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ సీబీఐ కేసుల్లో సుప్రీం కోర్టు ఎలాంటి బెయిల్ మంజూరు చేయలేదు. దీంతో రిమాండులోనే కొనసాగనున్నారు సీఎం కేజ్రీవాల్. ఒక వేళ బయటకు రావాలంటే.. సీబీఐ కేసుల్లో కూడా మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దానిని స్వీకరించి విచారణ జరిపిన తరువాత ఇచ్చే కోర్టు ఆదేశాలపై ఆధారపడి ఉంటుంది. అంతవరకూ కేజ్రీవాల్ బయటకు వచ్చేందుకు అవకాశం ఉండదు. ఇప్పుడు బెయిల్ మంజూరైంది కేవలం ఈడీ కేసుల్లోనే అన్నది గమనించాల్సి విషయం. మరి రానున్న రోజుల్లో సీఎం కేజ్రీవాల్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

## కవితకు బెయిల్.. అప్పుడేనా

విధించడంతో నాలుగు నెలలుగా తీహార్ జైల్లో ఉంటుంది. అరెస్టై ఐదు నెలలు కావస్తున్న ఆమెకు ఇంతవరకు బెయిల్ దొరకలేదు. కవిత పలుమార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కానీ ప్రతీసారి దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వ్యతిరేకిస్తున్నాయి. చార్జిషీటు దాఖలు చేసినా కవితకు బెయిల్ ఇవ్వొద్దని కోర్టులకు విన్నవిస్తున్నాయి. దర్యాప్తు సంస్థల వాదనలతో న్యాయమూర్తులు కూడా ఏకీభవిస్తున్నారు. దీంతో కవిత బెయిల్ ఆశలు ఆవిరవుతున్నాయి. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంతోపాటు, ఢిల్లీ హైకోర్టులో బెయిల్ కోసం కవిత తరపు న్యాయవాదులు పలుమార్లు పిటిషన్ వేశారు. ఇక్కడ నిరాశ ఎదురుకావడంతో ఈసారి సుప్రీంకోర్టు తలుపు తట్టే యోచనలో ఉన్నారు. తీహార్ జైల్లో కవితను కలిసి ఎందుకు వెళ్లిన కేటీఆర్, హరీశ్‌రావు ఈ మేరకు సూచనలు చేశారు. ఇదే సమయంలో బీజేపీ పెద్దలతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కవిత బెయిల్.. కేజ్రీవాల్ బెయిల్‌తో ముడిపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిన తర్వాతనే కవితకు బెయిల్ వచ్చేందుకు మార్గం సుగమం అవుతుందని న్యాయనిపుణులు చెబుతున్నమాట. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఆయనకు కింది కోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిని దర్యాప్తు సంస్థలు హైకోర్టులో సవాల్ చేశాయి. హైకోర్టు బెయిల్‌కు బ్రేక్ వేసింది. ప్రస్తుతం ఆయన సుప్రీంకోర్టులో బెయిల్ కోసం పోరాడుతున్నారు. సుప్రీంకోర్టులో ఆయనకు బెయిల్ వస్తే కవిత కూడా అదే మార్గం అనుసరించే అవకాశం ఉంది. లిక్కర్ స్కాంలో అప్రూవర్లుగా మారిన వారికి మాత్రమే ఇప్పటివరకు న్యాయస్థానాలు బెయిల్ ఇచ్చాయి. ఢిల్లీ డిప్యూటీ సీఎంగా సిసోడియా అరెస్ట్ అయి ఏడాది దాటిపోయింది. అప్రూవర్‌గా మారకపోవడంతో ఆయనకు బెయిల్ రాలేదు. కవిత, కేజ్రీవాల్ కూడా అప్రూవర్‌గా మారడానికి అంగీకరించడం లేదు. దీంతో దర్యాప్తు సంస్థలు వారిని వెంటాడుతూనే ఉన్నాయి.

## మల్లారెడ్డి మాస్టర్ ప్లాన్ ఏంటీ?

ఫేమస్ అయ్యారు. ఇక 2014లో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి.. తన క్రేజ్ ను మరింత పెంచుకున్నారు. మల్లారెడ్డి అంటేనే ఓ బ్రాండ్‌గా అందరికీ గుర్తిండిపోయారు. 2014లో తొలిసారిగా మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన మల్లారెడ్డి... ఆ తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరి... రాష్ట్రమంత్రి కూడా అయిపోయారు. ఇక గత ఎన్నికల్లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచినా, బీఆర్ఎస్ ఓడిపోవడంతో మల్లారెడ్డికి కష్టాలు ఎక్కువయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన మల్లారెడ్డి అప్పట్లో విసిరిన చాలెంజ్ లతో ప్రత్యర్థుల సంఖ్యను పెంచుకున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వ్యక్తిగతంగా కూడా మల్లారెడ్డికి పొసగకపోవడంతో ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వానికి టార్గెట్‌గా మారడంతో అండ కోసం ఎదురుచూసిన మల్లారెడ్డి బీజేపీలో చేరాలని... ఆ పార్టీతో టచ్ లోకి వెళ్లారని ప్రచారం జరిగింది. కానీ, మల్లారెడ్డికి బీజేపీలో చేర్చుకునే విషయంలో సానుకూల స్పందన లేకపోవడంతో మరింత ఇబ్బందులు పెరిగిపోయాయట. ఐతే ఈసారి మల్లారెడ్డి వేసిన ప్లాన్‌తో మొత్తం తెలంగాణ రాజకీయం రక్తి కట్టేలా కన్పిస్తోందప్రస్తుతం మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి కూడా ఎమ్మెల్యేలుగా ఉన్నారు. బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఈ ఇద్దరూ తొలుత కాంగ్రెస్‌లోకి వెళ్లాలని భావించారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే విభేదాలు ఉండటంతో ఆ పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో మల్లారెడ్డి విద్యాసంస్థల్లో ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం పూనుకోవడం, వరుసగా కేసులు నమోదు చేయిస్తుండటం, తన నియోజకవర్గంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కాంగ్రెస్ లో చేర్చుకుంటూ తనను ఒంటరిని చేయాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తుండటం వల్ల... హస్తం పార్టీతో చేతులు కలపాలనే ఆలోచనను విరమించుకున్నారు మల్లారెడ్డి. ఆ తర్వాత కమలం గూటికి చేరేందుకు ప్రయత్నించారు. కావాలంటే రాజీనామా చేసైనా బీజేపీ తరపున పోటీ చేసి గెలుస్తానంటూ ఆఫర్ కూడా ఇచ్చారట. అయితే కారణమేదైనా బీజేపీ నుంచి కూడా రెడ్ సిగ్నలే పడింది. ప్లాన్ A కింద కాంగ్రెస్, ప్లాన్ Bగా బీజేపీని ఎంచుకున్న మల్లారెడ్డి.. ఆ రెండు పార్టీల నుంచి ప్రతికూల స్పందనే ఎదురవడంతో ఈ సారి గమ్మత్తైన ప్లాన్ వేశారు. అదే తన పొలిటికల్ కెరీర్‌ను ప్రారంభించిన టీడీపీలో చేరడం ద్వారా తన రాకను అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఒకేసారి చెక్ చెప్పాలని భావిస్తున్నారు మల్లారెడ్డి. తెలంగాణలో టీడీపీకి పెద్దగా బలం లేకపోయినా, తనకు ప్రభుత్వం నుంచి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే టీడీపీలో చేరడం కూడా మంచిదే అన్న ఆలోచనలో పడ్డారు మల్లారెడ్డి. ప్రస్తుతం తెలంగాణ టీడీపీకి పెద్ద దిక్కు లేకపోవడం కూడా తనకు కలిసివస్తుందని భావిస్తున్నారు. తనతోపాటు ఒకరిద్దరు ఎమ్మెల్యేలను టీడీపీలోకి తీసుకువెళ్లి.. ఆ పార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా చక్రం తిప్పాలని భావిస్తున్నారట మల్లన్న. ప్రస్తుతం బీజేపీ, టీడీపీ మధ్య పొత్తు ఉండటం, కేంద్రంలో టీడీపీ కీలకంగా మారడంతో తాను టీడీపీలో ఉంటే తనకు ఇండైరెక్ట్ గా బీజేపీ మద్దతు ఉంటుందని భావిస్తున్నారు మల్లన్న. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య సత్సంబంధాలు ఉండటంతో... తెలంగాణ ప్రభుత్వం తన వైపు చూసే అవకాశమే ఉండదని ప్లాన్ చేస్తున్నారట మల్లన్న...తెలంగాణలోనూ తన అస్థిత్వాన్ని కాపాడుకోవాలని చూస్తున్న టీడీపీ... మల్లారెడ్డి వంటివారు చేరతామంటే కాదనడనే ధీమాలో మల్లన ఉన్నారని తెలుస్తోంది. దీంతో తన మదిలోని ఆలోచనను సన్నిహితులతో పంచుకున్నారట.. ఇక టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తన ప్రతిపాదనను తీసుకెళ్లేందుకు అడుగులు వేస్తున్నారని సమాచారం. టీడీపీలో చేరితే ప్రస్తుతానికి తనకు ఉన్న ముప్పు నుంచి తప్పించుకోవచ్చని.. నాలుగున్నరేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లోనూ బీజేపీతో అలయెన్స్‌తో రాజకీయంగా చక్రం తిప్పవచ్చనే అంచనాలో ఉన్నారట మల్లన్న. టీడీపీ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మల్లారెడ్డి.. మళ్లీ టీడీపీ గూటికే వెళతారనే ప్రచారం తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. వాస్తవానికి సీఎం రేవంత్‌రెడ్డికి, మల్లారెడ్డికి టీడీపీలో ఉన్నప్పుడే విభేదాలు మొదలయ్యాయి. ఇక బీజేపీ కూడా టీడీపీ మిత్రపక్షం కావడం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి రాజకీయ మార్పులు జరిగినా తాను సేఫ్ జోన్‌లో ఉంటారనే ఆలోచనతోనే టీడీపీయే బెస్ట్ చాయిస్‌గా ఎంచుకోవాలని మల్లారెడ్డి ఆలోచిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి మాస్ మల్లన్న పొలిటికల్ యాక్షన్‌పై తెలంగాణలో హాట్ డిబేట్ జరుగుతోంది.

# రాహుల్ దమ్ముంటే ఓయూలో తిరగగలవా..?

▶▶ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**జయభేరి, హైదరాబాద్:**



బీజేపీ కార్యవర్గ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తోందంటూ మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి నేను సవాల్ చేస్తున్నా. మీ పార్టీయే తెలంగాణలో అధికారంలో ఉంది కదా. ఉస్మానియా యూనివర్శిటీలో తిరిగే దమ్ముందా? అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. 6 గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ చేసిన మోసాలను గుర్తించి బీజేపీకి 8 ఎంపీ సీట్లు అందించి తెలంగాణలో బీజేపీయే ప్రత్యామ్నాయం అని తీర్పునిచ్చిన తెలంగాణ ప్రజలకు ఇదే నా సెల్యూట్'' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సమావేశానికి వచ్చిన వారితో కలిసి లేచి నిలబడి 'తెలంగాణ ప్రజలకు సెల్యూట్' చేశారు. శంషాబాద్ సమీపంలోని మల్లికా కన్వెన్షన్ లో జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో బండి సంజయ్ 3వ సారి మోదీ ప్రభుత్వానికి అవకాశమిచ్చిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు. తెలంగాణ ప్రజలకు, బీజేపీకి విడదీయరాని బంధముంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష్మణ్ ఆధ్వర్యంలో 4 ఎంపీ సీట్లను అందించారు. మొన్నటి ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లు, 8 ఎమ్మెల్యే సీట్లు అందించి కాంగ్రెస్ కు బీజేపీయే ప్రత్యామ్నాయం అని నిరూపించారు. ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా అన్నింటినీ భరిస్తూ, తెగిస్తూ పోరాడుతున్నందునే బీజేపీపట్ల తెలంగాణ ప్రజలకు నమ్మకం ఏర్పడింది.


కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను చూసి మోసపోయారని తెలుసుకున్న ప్రజలు 8 ఎంపీ సీట్లు గెలిపించి మోదీకి పట్టం కట్టారు. ఎంపీ ఎన్నికల్లో జవాన్ ను అడిగినా, మహిళలను అడిగినా, చివరకు సామన్య ప్రజలను ఎవరిని అడిగినా 'మోదీ'యే మాకు గ్యారంటీ అని చెబుతున్నారు. వార్డు మెంబర్ నుండి ఇతర పార్టీల ప్రజా ప్రతినిధులు కూడా మోదీయే గ్యారంటీ అని చెబుతూ బీజేపీకి ఓటేశారు. మోదీ ప్రభుత్వం మళ్లీ వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ విష ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదు. ఈ దేశానికి గ్యారంటీ మోదీయేనని నిరూపించారు. మోదీ స్ఫూర్తితో తెలంగాణలోనూ రామరాజ్యం రావాలని ప్రజలు భావిస్తున్నారు.

బీజేపీ కార్యకర్తలు చేసిన పోరాటాలు మరువలేనివి. ఎన్ని కేసులు ఎదురైనా తెగించి కొట్లాడారు. పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మోదీ సంక్షేమ పథకాలను, విజయాలను వివరించి పనిచేశారు. కార్యకర్తల కష్టార్జితంతోనే బీజేపీ అధికారంలోకి వచ్చింది. కార్యకర్తలు తమ భుజంపై కాషాయ జెండాను మోశారు. వారందరికీ నా సెల్యూట్

తెలంగాణలో కాంగ్రెస్ లేదంటే బీఆర్ఎస్ మాత్రమే అధికారంలో ఉండాలని ఆ రెండు పార్టీలు కుట్ర చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాయి.

ఈ దేశం సుభిక్షంగా ఉండాలంటే... ఈ దేశ ప్రజల బతుకులు బాగుపడాలంటే మోదీయే ప్రధానిగా ఉండాలని బీజేపీకి ఓటేశారు.. ఈసారి తెలంగాణలోనూ అధికారంలోకి రాబోయేది బీజేపీ మాత్రమేనని ఘంటాపథంగా చెబుతున్నా. కాంగ్రెస్ 6 గ్యారంటీల పేరుతో దారుణంగా మోసం చింది. రైతులను మోసం చేసింది. మోదీ ఇచ్చిన మాట తప్పని వ్యక్తి. ప్రధాని కాగానే కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేశారు. కనీస మద్దతు ధర పెంచారు. సబ్సిడీలపై ఎరువులను పంపిణీ చేస్తున్నారు. నేను ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి సవాల్ చేస్తున్నా. తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే కదా. మీకు దమ్ముంటే ఉస్మానియా వర్శిటీకి వెళ్లి నిరుద్యోగులను కలిసి మాట్లాడగలరా? అప్పుడు తెలుస్తుంది. తెలంగాణలో నిరుద్యోగం ఏ విధంగా అంటువ్యాధిలో వ్యాపిస్తుందో, కాంగ్రెస్ గెలిచి 7 నెలలైనా ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీయే అంటువ్యాధి లాంటిది. మోదీ రోజ్ గార్ మేళాతో 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. అయినా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా విస్తరిస్తోందని రాహుల్ గాంధీ చెప్పడం సిగ్గు చేటు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ పార్టీ విష ప్రచారం చేసినా, రాజ్యాంగాన్ని మార్చేస్తారని అబద్ధాలను ప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోకుండా నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టారు. మోదీ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు.

# కాంట్రాక్టర్లకు బిల్లులూ ఇవ్వలేదు



**జయభేరి, అమరావతి, జూలై 12:**

రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై సీఎం నారా చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. గత ప్రభుత్వం రోడ్ల స్థితిగతులను పట్టించుకోలేదని, దీంతో వాహనదారులు, ప్రజలు ఐదేళ్ల పాటు నరకం చూశారని సీఎం అన్నారు. ఈ పరిస్థితిని మార్చే పనులు మొదలు కావాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దెబ్బతిన్న రోడ్లను బాగుచేసే ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించారు. సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రోడ్ల దుస్థితి, నిధుల అవసరం, ప్రస్తుతం ఉన్న సమస్యలపై సీఎంకు అధికారులు వివరించారు. నాడు రోడ్ల మరమ్మతులపై కనీస మొత్తంలో కూడా నిధులు ఖర్చు చేయలేదని సీఎంకు అధికారులు తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదన్నారు. దీంతో కాంట్రాక్టర్లు కూడా నేడు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని అన్నారు. రాష్ట్రంలో 4,151 కిలోమీటర్ల మేర రోడ్లపై పాత్ హోల్స్ (గుంతలు) సమస్య ఉందని అధికారులు వివరించారు. తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2,936 కిలోమీటర్లు మేర ఉన్నాయని సిఎంకు తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో 7,087 కిలోమీటర్ల పరిధిలో తక్షణం పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. వీటి కోసం కనీసం రూ.300 కోట్ల నిధులు అవసరం అని తెలిపారు. పాత్ హోల్స్ పూడ్చే పనులు వెంటనే చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. అత్యంవసరంగా బాగు చేయాల్సిన రోడ్లపైనా దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. వెంటనే టెండర్లు పిలిచి అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించారు.

సాంకేతిక అంశాలపై నిపుణులతో చర్చ

రోడ్ల మరమ్మతులు, నిర్మాణంలో కొత్త, మెరుగైన సాంకేతికతను వినియోగించే విషయంపై సమీక్షలో చర్చించారు. తిరుపతి ఐఐటి, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ప్రభుత్వ అధికారులు, నిర్మాణ రంగ నిపుణులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో, మన్నిక ఉండేలా రోడ్ల నిర్మాణానికి జరిగిన పరిశోధనల వివరాలను సమీక్షలో సీఎంకు తెలిపారు. సాంప్రదాయ పద్ధతిలో కాకుండా పలు రకాల మెటీరియల్స్ ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేపడితే కలిగే ప్రయోజనాలపై చర్చించారు. నేల తీరు, ట్రాఫిక్ రద్దీ, వర్షాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలంలో కూడా రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టే సాంకేతికపైనా నిపుణులు సాధ్యాసాధ్యాలను వివరించారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ అధికారులు, నిర్మాణ రంగ నిపుణులు పాల్గొన్నారు.



## నీట్ పేపర్ సూత్రధారి రాకీ అరెస్ట్

చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు అరెస్టైన వారి సంఖ్య 12 మందికి దాటింది. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ రాకెట్‌పై దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన సీబీఐ ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ప్రథమ సమాచార నివేదికలో దాఖలు చేసింది. నీట్ పేపర్ లీకేజీకి హజారీబాగ్ స్కూల్‌తో సంబంధాలు ఉన్నాయని సీబీఐ వర్గాలు తెలిపాయి. అక్కడి నుంచి లీకైన పేపర్లు బీహార్‌కు చేరుకున్నాయని ఓ సీబీఐ అధికారి తెలిపారు. పేపర్ లీకైన క్రమాన్ని వివరిస్తూ... మే 5న జరగాల్సిన పరీక్షకు సంబంధించిన తొమ్మిది సెట్ల పేపర్లు భద్రపరిచేందుకు రెండు రోజుల ముందుగానే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌కు నీట్ యూపీ క్వశ్చన్ పేపర్లు చేరుకున్నాయి. అక్కడి నుంచి పరీక్ష కేంద్రంగా ఉన్న హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్‌కు రెండు సెట్‌లను తరలించారు. పాఠశాలకు చేరుకునేలోపు వాటికి వేసి ఉన్న సీల్స్ తొలగించి ఉన్నాయి. ప్రశ్న పత్రాలు సీల్ చేయని సమయంలో అక్కడ రాకీ ఉన్నట్లు ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. అతను ప్రశ్నలను ఫోటోలు తీసి వాటికి సమాధానాలు గుర్తించే ముఠాకు చేరవేశాడు. పేపర్‌కు సమాధానాలు గుర్తించిన తర్వాత నీట్ అభ్యర్థులతో బేరసారాలు చేసి, లక్షల్లో దోచుకున్నారు. రెండు దశాబ్దాలుగా పేపర్ స్కామ్‌లో పరారీలో ఉన్న ఈ రాకెట్‌లోని మరో కీలక వ్యక్తి సంజీవ్ ముఖియాతో కూడా రాకీ టచ్‌లో ఉన్నాడు. విచారణలో ప్రశ్నాపత్రం ఎందరికి చేరింది అనే విషయం బయటపడే అవకాశం ఉంది. ఇప్పటివరకూ రెండూ చోట్ల పేపర్ లీక్ అయినట్లు అధికారులు గుర్తించారు. అయితే పేపర్లు ఎక్కడి నుంచి లీక్ అయ్యాయో స్పష్టంగా తెలియనప్పటికీ, బ్యాంకు బ్రాంచ్ నుంచి స్కూల్ రవాణా చేస్తున్నప్పుడు మార్గం మధ్యలో పేపర్ బయటకు వచ్చి ఉంటుందని సీబీఐ వర్గాలు అనుమానిస్తున్నారు. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులలో ప్రవేశానికి ఈ ఏడాది మే 5వ తేదీన నిర్వహించిన నీట్ యూజీ 2024 పరీక్షకు దేశ వ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత 67 మందికి ఫస్ట్ ర్యాంకులు రావడంతో ఒక్కసారిగా దేశమంతా షాక్‌కు గురయ్యారు. వీరిలో ఒకే కోచింగ్ సెంటర్‌లో 720 మార్కులు సాధించిన ఆరుగురికి ఫస్ట్ ర్యాంకులు వచ్చాయి. మరోవైపు ప్రశ్నాపత్రం ఆలస్యంగా అందించారన్న కారణంలో 1,563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడం వివాదానికి దారి తీసింది. అయితే గ్రేస్ మార్కులు ఇచ్చిన వారందరికీ రీటెస్ట్ పెట్టి, కొత్త ర్యాంకులు ప్రకటించినా.. ప్రస్తుతం పేపర్ లీక్ వ్యవహారం తేలాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నీట్ పరీక్ష మరోసారి పెట్టాలని డిమాండ్లు వస్తున్నప్పటికీ కేంద్రం మాత్రం.. లీకేజ్ స్థానికంగానే ఉందని చెబుతోంది. సోషల్ మీడియాలో పేపర్లు షేర్ చేయలేదని పేర్కొంటోంది. మరోవైపు ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ల విచారణను జులై 18కి వాయిదా పడింది.



## భారీగా పట్టుబడుతున్న డ్రంకన్ అండ్ డ్రైవ్

ఉన్నాయి. వీరిలో 55 మందికి 15 రోజుల జైలు శిక్ష వేశారు న్యాయమూర్తులు. ఎనిమిది మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశారు. కాగా తాగి వెహికల్స్ నడిపిన మందుబాబుల నుంచి 21 లక్షల 36 వేల రూపాయల ఫైన్ వసూలు చేశారు పోలీసులు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికే వాహనాల్లో ఎక్కువగా బైక్స్ ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. అదే పనిగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 2 సార్లకు మించి దొరికితే శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తామని.. పోలీసుల వార్నింగ్ ఇస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం వల్ల.. అమాయకులు ప్రాణాలు పోతున్నాయని. ఇలాంటివారిని అస్సలు ఉపేక్షించేది లేదన్నారు పోలీసులు. మరోవైపు రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు.. అలాంటివారిపై కేసులు బుక్ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే.. ఇంతకు ముందులా ఫైన్స్ వేసి వదిలేయడం ఉండదని.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## జపాన్ లో లాఫ్ రూల్

జరిగిన తరవాతే రూల్ తీసుకొచ్చారు. రోజుకోసారి నవ్వడం ద్వారా మానసికంగా, శారీరకంగా కలిగే ప్రయోజనాలేంటో ప్రజలకు అర్థం అవుతుందనే ఉద్దేశంతోనే ఈ నిబంధన తీసుకొచ్చినట్టు ప్రభుత్వం వివరణ ఇస్తోంది. అటు వర్క్ ప్లేసెస్‌లోనూ ఈ రూల్‌ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు అందాయి. పని వాతావరణం ఎప్పుడూ సంతోషంగా ఉండాలని తేల్చిచెప్పారు. అంతే కాదు. ప్రతి నెల 8వ రోజుని "డే ఆఫ్ లాఫ్టర్"గా జరుపుకోనున్నారు. అయితే..ఈ రూల్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు మంచిదే అంటుంటే మరి కొందరు ఇదేం రూల్ అని మండి పడుతున్నారు. నవ్వాలా వద్దా అన్నది వ్యక్తిగత ఇష్టమని, రాజ్యాంగం కల్పించే హక్కుని కాదని బలవంతంగా నవ్వమంటారా అని ప్రశ్నిస్తున్నారు. నవ్వడం ఎంత ముఖ్యమైనప్పటికీ కొంత మంది లోలోపలే హ్యాపీగా ఫీల్ అవుతారని, అలాంటి వాళ్లూ నవ్వాలని ఒత్తిడి తీసుకురావడం సరికాదని వాదిస్తున్నారు. అంతే కాదు. ఆరోగ్య కారణాల వల్ల నవ్వలేని వాళ్లకి ఈ రూల్ నుంచి మినహాయింపు ఇవ్వాలనీ అంటున్నారు. నవ్వడం ఎంత మంచిదే అయినా ఇలా బలవంతం చేసి నవ్వించడం వల్ల ఎలాంటి ఉపయోగముండదని తేల్చి చెబుతున్నారు. అంతకు ముందు రీసెర్చ్ కోసం 17 వేల మందిపై స్టడీ చేశారు. వాళ్లందరూ ఎప్పుడెప్పుడు ఎంత సేపు నవ్వుతారో అని అడిగి తెలుసుకున్నారు. కొన్నేళ్ల పాటు వాళ్ల హెల్త్ రికార్డ్‌ని ట్రాక్ చేశారు. వారంలో కనీసం ఓసారైనా నవ్విన వాళ్లలో గుండె సంబంధిత సమస్యలు చాలా అరుదుగా కనిపించాయి. నెలకోసారి నవ్వే వాళ్లలో కొన్ని సమస్యలు కనిపించాయి. ఈ రీసెర్చ్ ఆధారంగానే ప్రభుత్వం అక్కడ నిబంధన తీసుకొచ్చింది.

# ఘనంగా ఆషాడమాస ఉత్సవాలు

- ఆయా గ్రామాల మీదుగా కొనసాగిన శోభాయాత్ర
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు.. భజనలు, కోలాటలతో మారుమ్రోగిన గ్రామాలు

**జయభేరి, జులై 12:**

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలో 93వ ఆషాడ శోభాయాత్ర ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని కేశ్వాపూర్ గ్రామం నుంచి పాండు రంగాశ్రమం వరకు హరేరామ హరేకృష్ణ భజనలతో ఈ శోభాయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కేశ్వాపూర్ లోని శ్రీయతివరభవానంద స్వాముల చేతుల మీదుగా ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఉద్దెమర్రి, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, కర్కపట్ల, దామరకుంట, పాండురంగాశ్రమం వరకు కొనసాగింది. ఈ యాత్రలో మెదక్, నల్గొండ, మేడ్చల్, జిల్లాల నలుమూలల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భగవన్నామస్మరణతో పులకించిపోయారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భవానంద స్వామి పాదుకలకు హారతులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పురవీధుల్లో భజనలతో భక్తులు కోలాటాలు ఆడుతూ పాటలు పాడుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అంతకుముందు కేశ్వాపూర్ శ్రీభవానంద స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన వేద పండితులను శాలువాతో ఘనంగా సన్మానించారు. లక్ష్మాపూర్ గ్రామంలోని శతకోటిహరేరామ భక్తజన బృందం ఆలపించిన భజనలు భక్తులను మైమరపింప చేశాయి. ఈ శోభాయాత్ర లో వివిధ గ్రామాల నుంచి భక్తజన బృందాలు విచ్చేసి పాల్గొన్నాయి. అనంతరం పాండురంగాశ్రమంలో నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







తెలంగాణ రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ గా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ కి చెందిన నాగరిగారి ప్రీతం నియమితులైన సందర్భంగా వారిని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మోత్కూర్ మున్సిపల్ ఛైర్పర్సన్ గుర్రం కవితలక్ష్మి నరసింహ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఆంజనేయులు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**

## వ్యాక్సిన్ సెంటర్ నీ సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే



**జయభేరి, ఉప్పల్ :**

రామంతపూర్ పరిధిలోని రాజేంద్ర నగర్ లో చిన్న పిల్లలకి వేసే వ్యాక్సిన్ సెంటర్ నీ సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా పిల్లల కి సమయానికి వ్యాక్సిన్ వేయించాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు, BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, BRS నాయకులు పవన్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పురాతన మైసమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

- పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది - కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి

**జయభేరి, జులై 12:**

మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన పులకుర్తి సత్తయ్య, పాపమ్మ లకు చెందిన వ్యవసాయ పొలం వద్ద ఉన్నటువంటి మైసమ్మ ఆలయ పూనర్ నిర్మాణానికి నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి అనంతరం 10 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. కౌన్సిలర్ తో పాటు కాలనీ వాసులు అయిన వాగోలు రమేష్ బాబు 10 వేల రూపాయలు, లక్ష్మీ సుబ్బయ్య 10 వేల రూపాయలు, చిందం నర్సింహా 5001 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సంధర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతు పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయ పునర్ నిర్మాణం కోసం తమ వంతు సాయం అందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులకుర్తి నర్సింహా, సత్యం రాజు, చెండి శ్రీనివాస్, టి. శ్రీనివాస్, నర్సింహా, రాము, ఆంజనేయులు, సంపత్, సత్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





## శాకంబరీ దేవి అలంకారంలో ఉజ్జయిని మహంకాళి

**జయభేరి, సికింద్రాబాద్:**

శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారు శుక్రవారం రోజున శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వ్వ మనున్నారు. ఈ మేరకు ఆలయ కార్య నిర్వహణ అధికారి గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం లో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఆషాడ బోనాల జాతరలో భాగంగా ఇప్పటికే అమ్మవారి ఘటోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా ప్రారాంబమై కొనసాగుతుంది. ఆలయానికి రాలేని భక్తులు అమ్మవారిని తమ ఇళ్ళ ముందే దర్శించుకుని పూజలు నిర్వహించుకునే విధంగా ఘటాన్ని పురవీధుల్లో ఊరేగిస్తారు .ఇప్పటికే పలు వీధుల్లో అమ్మవారి ఘటం భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులుకు దర్శనం ఇవ్వ నున్నారు.అమ్మవారిని చూసి పూజలు నిర్వహించేందుకు జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు .ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు . శాకాంబరి దేవి గా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో వివిధ రకాలైన కూరగాయలతో ఆలయంతో పాటు గర్భగుడిని కూడా అలంకరణ చేసారు. ఇదే సమయంలో ఆలయం మొత్తాన్ని రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు . శాఖాంబరి దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో సుమారు నాలుగు వేల కిలోల వివిధ రకాల కూరగాయలతో ఆలయంలో అలంకరణ చేసారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఈఓ మనోహర్ రెడ్డి వెల్లడించారు.

## బోరును వేయించాలని ప్రిన్సిపాల్ విన్నపం

**జయభేరి, ఘట్కేసర్ :**

గురుకుల్ కళాశాలలో 9, 10 తరగతిలో ఉపాధ్యాయులు విద్యార్థుల కొరత ఉండటంతో అక్కడ చదువుతున్నటువంటి తొమ్మిదవ తరగతిలోని ఒక విద్యార్థి, పదవ తరగతిలోని నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించిన తర్వాత వారిని జిల్లా పరిషత్ హై స్కూల్లో చేర్పించడం జరుగుతుందని.. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ చెప్పడం జరిగింది.

అదేవిధంగా గురుకుల్ కళాశాల విద్యార్థులకు నీటి కొరత ఏర్పడడంతో స్థానిక కౌన్సిలర్ బర్ల దేవేందర్ ముదిరాజ్, ప్రిన్సిపాల్ విన్నపం మేరకు బోరును వేయించాలని చెప్పడంతో ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మున్సిపల్ నిధులతో బోరు బావిని నిర్మిస్తానని మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బర్ల దేవేందర్ ముదిరాజ్, 18వ వార్డు కౌన్సిలర్ కుతాడి రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు విడుకోలు సమావేశం



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పదోన్నతి,బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు విడుకోలు సమావేశం ఏర్పాటు చేయడం చేసినారు ప్రధానోపాధ్యాయులు సురేందర్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. బదిలీ పైన వెళ్లిన ఉపాధ్యాయులు పెద్దన్న పద్మాచారి, సత్యవతి, మనోహర్, మధు, ప్రవీణ్, రవి తీదేడు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు,విద్యార్థులు తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్, మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు మర్రు పాండురంగారావు, మాజీ సర్పంచ్ లు దాసరి శ్రీనివాస్ యాదవ్, రావు వెంకట నర్సింహ రావు, కాయితి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు వాసుదేవ రెడ్డి, శ్రీరాములు, ఉపాధ్యాయులు, సన్మాన గ్రహీతలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేనావత్ రమేష్ నాయక్ మృతి బాధాకరం

- టిపిసిసి సభ్యులు పిఏసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి



**జయభేరి, కొండ మల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని చింతచెట్టు తండా గ్రామపంచాయతీ ఫుల్ సింగ్ తండ కు చెందిన కొండమల్లెపల్లి మండల యువజన కాంగ్రెస్ నాయకులు నేనావత్ రమేష్ నాయక్ మృతి చాలా బాధాకరం, రమేష్ నాయక్ స్వగ్రామం పుల్సింగ్ తండాలో రమేష్ నాయక్ మృతదేహాన్ని నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన టీపీసీసి సభ్యులు పిఎస్ సిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి.



తెలంగాణ బీసీ కోఅపరేటివ్ చైర్ పర్సన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ని మర్యాద పూర్వకంగా కలిసిన టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్. బంజారాహిల్స్ పరిధిలోని తెలంగాణ బీసీ కోఅపరేటివ్ అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ గా పదవి భాద్యతలు చేపట్టిన నూతి శ్రీకాంత్ గౌడ్ ని ఆయన నివాసంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జ పరమేశ్వర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

**జయభేరి, ఉప్పల్**

## పాడయిన పన్నీరు.. పాలు స్వాధీనం

- కిచెన్ లో తిరుగుతున్న ఎలుకలు, పందికొక్కులు
- ఇదీ పేరుగాంచిన ఎమరాల్డ్ స్వీట్స్ భాగోతం

**జయభేరి, హైదరాబాద్:**

హైదరాబాద్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇందిరా పార్క్ సమీపం గల ఎమ్రాల్డ్ స్వీట్స్ లో జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ తనిఖీలు జరిగాయి. స్వీట్ల తయారీలో పేరుగాంచిన ఎమరాల్డ్ స్వీట్స్ షాప్ కిచెన్ లో దారుణమైన పరిస్థితులు బయటపడ్డాయి. కంపు కొడుతూ దుర్గంధ భరితమైన వాతావరణంలో స్వీట్ల తయారీ చేస్తున్నట్లు గుర్తించారు. రోజుల తరబడి ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన పాలు, పెరుగు, పన్నీర్ సీజ్ చేసారు. స్వీట్ల తయారీలో మోతాదుకు మించి ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కిచెన్ లో ఎలుకలు, పందికొక్కులు తిరుగుతున్నాయి. దాంతో ఎమరాల్డ్ స్వీట్స్ తయారీ నిర్వాకులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు సీరియస్ అయ్యారు.

# చెరువులో దోమల నివారణకు ఆయిల్ బాల్స్

**జయభేరి, ఘట్కేసర్ :**

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఎదులాబాద్ రోడ్ చేట్టేరుకుంట చెరువు వద్ద Friday Dry Day ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. చిట్టేరుకుంట చెరువులో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని. అలానే వర్షాకాలం వచ్చింది అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ ఇంటి పరిసర ప్రాంతాలలో నీటిని నిల్వ ఉండకుండా చూస్కోవాలంటూ సూచించారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్ గౌడ్, ఘట్కేసర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీను, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాజేష్, యోగేష్, మున్సిపల్ స్టాఫ్ పాల్గొన్నారు.






# మారిపోయే నా లోకమే

ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. అశ్విన్ కె రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కె.నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని మూడో గీతం 'సునో చెలియా' శుక్రవారం విడుదలైంది. వివేక్‌సాగర్ స్వరపరచిన ఈ గీతాన్ని కాసర్ల శ్యామ్ రాయగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 'మనసంటూ ఒకటుందని లోపల తోచిందే తొలిసారే.. కనులొచ్చి తిరిగిందే నా కల నీ వల్లే ఓ ప్రేమ.. మారిపోయే నా లోకమే.. నిన్న లేదే ఇంతందమే..' అంటూ ప్రేమికుల భావాలకు అద్దం పడుతూ చక్కటి మెలోడీతో ఈ పాట ఆకట్టుకునేలా ఉంది. కథానుగుణంగా సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉందని, ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, సంభాషణలు: హేమంత్, రచనదర్శకత్వం: అశ్విన్‌రామ్.



# అంబానీ ఇంట సారా అలీఖాన్ సందడి

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఇంట్లో పెళ్లి సందడి కొనసాగుతోంది. మరికాసేపట్లో ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ.. రాధికా మర్చంట్ మెడలో తాళి కట్టనున్నాడు. ఈ వేడుక చూసేందుకు సినీ, రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేస్తున్నారు. ప్రముఖుల రాకతో ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ కళకళలాడుతోంది. కాసేపటి క్రితం బాలీవుడ్ నటి సారా అలీఖాన్ తన సోదరుడు ఇబ్రహీం అలీఖాన్ తో కలిసి జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వేదికపైకి వచ్చిన ఆమె ఫొటోలు తీసేందుకు ఫొటో జర్నలిస్టులు పోటీపడ్డారు. ఆమె వెళ్లిపోయే ప్రయత్నం చేసినా కొద్ది ప్లీజ్ మేడం.. వన్ మోర్ ఫొటో అంటూ రిక్వెస్ట్ చేశారు. అందుకు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.



# ఫిల్మ్‌ఫేర్‌లో సాయిపల్లవి కొత్త రికార్డు

కథానాయికగా అడుగుపెట్టిన వేళావిశేషం. అనతికాలంలోనే అద్భుతమైన పేరుప్రఖ్యాతులు సొంతం చేసుకున్నది అగ్ర నటి సాయిపల్లవి శంతామరై. తొమ్మిదేళ్ల కెరీర్. చేసింది 19 సినిమాలు. ఈ కాస్త పిరియడ్‌లోనే ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకోవడం సామాన్యమైన విషయం కాదు. ఇప్పటివరకూ ఆరు ఫిల్మ్‌ఫేర్స్ అందుకున్న కథానాయిక దేశంలోనే లేరు. పాతతరం కథానాయిక నూతన్ సమర్ధ్, సీనియర్ కథానాయిక కాజోల్, అలియాభట్, వీరితోపాటు సాయిపల్లవి ఇప్పటివరకూ తలా అయిదుసార్లు ఫిల్మ్‌ఫేర్లు అందుకొని టాప్ లిస్ట్ ఉన్నారు. రీసెంట్‌గా ప్రకటించిన ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో అందర్నీ వెనక్కినెట్టి ఆరో ఫిల్మ్‌ఫేర్‌కు ఎంపికయ్యింది సాయిపల్లవి. ఇది నిజంగా గొప్ప విషయం. తొలి సినిమా 'ప్రేమమ్', తొలి తెలుగు సినిమా 'ఫిదా', శ్యామ్‌సింగరాయ్, లవ్‌స్టోరీ, గార్గీ సినిమాలకు గాను అయిదుసార్లు ఫిల్మ్‌ఫేర్‌లు అందుకున్న సాయిపల్లవి, 2022 సంవత్సరానికి గాను 'విరాటపర్వం' సినిమాకు బెస్ట్ యాక్ట్రెస్‌గా ఆరోసారి ఫిల్మ్‌ఫేర్‌ని అందుకోనున్నది. పైగా వాటిలో నాలుగు తెలుగు సినిమాలే కావడం విశేషం. ఈ సందర్భంగా సాయిపల్లవిపై ప్రశంసల వర్షం కురుస్తున్నది.





# గౌతమ్ మీనన్ మెగాస్టార్ సినిమాలో హీరోయిన్‌గా సమంత..?

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి - 'ఏం మాయ చేసావే', 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్' చిత్రాల ఫేమ్ తమిళ స్టార్ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ కాంబోలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. ప్రొడక్షన్.06 గా వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఓపెనింగ్ గత బుధవారం అట్టహాసంగా జరిగింది. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ప్రారంభంకాగా.. మమ్ముట్టి సొంత నిర్మాణంలో ఈ మూవీ రాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో కథానాయికగా టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సమంతను మేకర్స్ కలిసినట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రయూనిట్ అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక గౌతమ్ మీనన్ దర్శకత్వంలో సమంత ఇంతకుముందు 'ఏం మాయ చేసావే', 'ఏటో వెళ్ళిపోయింది మనసు' సినిమాల్లో నటించింది. సమంత ఈ మూవీ కూడా ఒకే చెప్పితే హ్యాట్రిక్ కాంబో అవుతుంది. కాగా.. ఈ సినిమాపై మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మెగాస్టార్ మమ్ముట్టి ఈ ఏడాది ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. గత ఏడాది కాథల్ ది కోర్ అంటూ బ్లాక్ బస్టర్ అందుకున్న మెగాస్టార్ ఈ ఏడాది భ్రమయుగం, టర్బో సినిమాలతో మంచి విజయాలను ఖాతాలో వేసుకున్నాడు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com